

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

### ఛుపాలో యూ దిల్ మె ప్యార్ మేరా

### కె జైసే మందిర్ మె లౌ దియే కీ

కొన్ని పాటలు వినగానే మనసుకు పట్టేస్తాయి. ఇంకా పాట పూర్తిగా ఆరంభం కాకముందే ఆ పాటలు మనసును దోచేస్తాయి. పాట పల్లవి వినటంతోటే మనసు ఆనంద సముద్రాల అలలపై మెరిసే నీటి బిందువులలా తళతళలాడుతుంది. ఒకో చరణం పూర్తవుతుంటే, అలలపై నృత్యం చేస్తున్న కిరణాల వెంబడి ఆకాశం వైపు ప్రాకుతుంది మనసు. పాట పూర్తయ్యేసరికి అంతరిక్షంలో, భార రహిత స్థితిలో తేలే శరీరంతో పాటూ మనసూ తేలికై అత్యంత ఆనందానుభూతిని, అలవికాని సౌఖ్యాన్ని అనుభవిస్తుంది.

ఒక్కసారి విన్న తరువాత ఇంతకాలం మనసు పొందిన అనుభూతి నిజమా? అబద్ధమా? అనిపిస్తుంది. దాంతో మరోసారి వినాల్సి వస్తుంది. అలా వింటూన్న ప్రతిసారీ నూతన ఆనందానుభూతుల ద్వారాలు తెరుస్తూ, సున్నిత భావాల స్వర్గంపై తెరతీస్తూ... సంగీతం, సాహిత్యం, గానం సమపాళ్లల్లో అత్యుత్తమ రీతిలో కలిస్తే కలిగే అత్యంత సున్నితమూ, మధురమూ, ఆధ్యాత్మిక భావాత్మకమూ అయిన గీతం, అది సినీ గీతం అయినా సరే హృదయాన్ని ఎంత ఎత్తుకు తీసుకు వెళ్లగలదో, ఎన్ని లోతైన మరపురాని మధురానుభూతులను అందించగలదో అంతటి స్థాయిలో ఆనంద తరంగాల శృంగాలు, లోయలపై తేలించగల శక్తి గలదీ 'మమత'. సినిమాలో రోషన్ సంగీత దర్శకత్వంలో లతామంగేష్కర్, హేమంత్ కుమార్‌లు పాడిన మజ్రూహ్ సుల్తాన్‌పురి గీతం.

సినీ సంగీత దర్శకుడు రోషన్ మధురమైన గీతాలను అతి సుందరంగా సృజిస్తాడు. అతడికి అతి ఇష్టమైన రాగం యమన్. ఆయన అధికశాతం పాటలను యమన్/యమన్ కళ్యాణ్ రాగాలలోనే సృజించాడు. ఎప్పుడెప్పుడు అవకాశం దొరికినా ఆయన యమన్ రాగంలోనే పాటను సృజిస్తాడు. 'ఛుపాలో యూ దిల్ మె' పాటను కూడా యమన్ రాగంలోనే

సృజించాడు. అయితే, యమన్‌లో అత్యంత మృదువయిన స్వరాలను ఎన్నుకుని అత్యంత భక్తిభావంతో గానం చేసే ఆధ్యాత్మిక శృంగార గీతాన్ని రూపొందించాడు రోషన్.

హిందీ సినీ ప్రపంచంలో గొప్ప గేయ రచయతలు ఎందరో ఉన్నారు కానీ అసలు సిసలైన సినీ గేయ రచయిత మజ్రూహ్ సుల్తాన్ పురి ఒక్కడే. ఎందుకంటే, ఇతర గేయ రచయతల వ్యక్తిత్వం వారి పాటలలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. వినగానే, ఇది సాహిర్ పాట, ఇది శైలేంద్ర పాట, ఇది భరత్ వ్యాస్ పాట అని సులభంగా చెప్పే వీలు ఉంటుంది. కానీ మజ్రూహ్ పాటల గురించి మాత్రం అలా చెప్పటం కుదరదు. ఎందుకంటే మజ్రూహ్ వ్యక్తిగతంగా అతని పాటలలో కనబడడు. అతని వ్యక్తిత్వం కనబడదు. పాటలలో సందర్భం కనిపిస్తుంది. పాత్రలు కనిపిస్తాయి. అంతే తప్ప మజ్రూహ్ ఆదర్శాలు, ఇష్టాయిష్టాలు, ఆలోచనలు ఏమీ కనబడవు. అందుకే అతడిని సంపూర్ణ సినీ గేయ రచయితగా భావిస్తారు. 'సి ఎ టి కాట్ కాట్ మానే బిల్లి' లాంటి పాట రాసిన మజ్రూష్, అవసరమైతే, 'జల్తే హై జిస్కేలియే' లాంటి అద్భుతమైన భావగీతం రాయగలడు. 'క్యాహువా తేరా వాదా' లాంటి సూపర్ హిట్ పాట రిషీకపూర్‌కు 70 దశకంలో రాసిన మజ్రూహ్ 1990ల దశకంలో 'ఆనా మేరే ప్యార్‌కో న తుం ఝూటా' అంటూ 'షారూఖ్‌ఖాన్'కు రాసి మెప్పించగలడు. 'జబ్ దిల్ హీ టూట్ గయా ' అని సైగల్‌కు పాట రాసి మెప్పించిన మజ్రూహ్, 'పహలా నషా' అంటూ అమీర్ ఖాన్‌కు రాసి ప్రేక్షకులను రంజింపచేయగలడు. 'చాంద్ ఫిర్ నిక్లా' అని నూతన్‌కు పాట రాసి ఎద కరిగించిన మజ్రూహ్ 'మేరే ఖ్వాబోం మే జో ఆయే' అంటూ కాజోల్‌కు పాట రాసి ఉర్రూతలూగించగలడు. ఇక్కడ ఏ పాటలో కూడా మజ్రూహ్ కనబడడు. కేవలం పాటలు, నాయికా నాయకులు, సినిమా సందర్భాలు కనబడతాయి. సందర్భ పరిధిలో ఒదుగుతూ అందరి ప్రజల మనస్సులను తరాలతో, మారుతున్న కాలం, మారుతున్న విలువలతో సంబంధం లేకుండా స్పందింప చేస్తాయి. అలరిస్తాయి. అందుకే 'ఛుపాలో యూ దిల్ మె' లాంటి పాట మజ్రూహ్ సుల్తాన్ పురి రచించాడంటే ఆశ్చర్యం కలగదు. మజ్రూహ్ లాంటి వాడే ఇలాంటి పాటను ఇంత అద్భుతంగా రాయగలడు అనిపిస్తుంది.

'మమత' సినిమా ఆ కాలంలో సూపర్ హిట్ అయిన సినిమా. పాటలు కూడా ఈనాటికీ ప్రజలను అలరిస్తున్నాయి. ముఖ్యంగా 'రహే న రహే హమ్' అన్న పాట ప్రతి కళాకారుడి 'గుర్తింపు సంతకం' లాంటి పాటగా నిలుస్తుంది. కానీ ఈ సినిమాలోనే కాదు హిందీ పాటల ప్రపంచంలో 'ఛుపాలో యూ దిల్ మె' లాంటి పాట అతి అరుదైంది. స్వచ్ఛమైన హిందీ భాష సరళమైన పదాలతో హిందీ భాషకు స్వాభావికమైన లాలిత్యం అణువణువునా నింపుకుని, భారతీయ సంస్కృతిలోని దైవత్వ భావనను ప్రేమ భావనలో ఆరోపించి, పాటను దేవత పాదాల చెంత దీపం వెలిగించి ఒక పువ్వును ఉంచినంత పవిత్రమైన భావన ప్రతిబింబించేట్టు సృజించాడు మజ్రూహ్.

'మమత' సినిమాలో ప్రధాన పాత్రధారులు సుచిత్ర సేన్, అశోక్ కుమార్లు. సుచిత్ర సేన్, అశోక్ కుమార్లు సినిమాలో ప్రేయసి, ప్రియులు. కానీ స్థాయీ భేదాల వల్ల పెళ్లి చేసుకోలేక పోతారు. సుచిత్ర సేన్ భర్త దుర్మార్గుడు. అతడినుంచి తప్పించుకుని కూతురిని తీసుకుని పారిపోతుంది సుచిత్ర సేన్. విధిలేక వేశ్య వాటికలో పాటలు పాడి నృత్యం చేస్తూంటుంది. అశోక్ కుమార్ అవివాహితుడిగా ఉండిపోతాడు. అయితే, సుచిత్ర సేన్ భర్త ఆమెని ప్రశాంతంగా ఉండనీయడు. కూతురిని ఎత్తుకు పోవాలని ప్రయత్నిస్తూంటాడు. దాంతో కూతురిని తమకు దూరంగా ఉంచుతుంది. చివరికి ఆ బాధ్యత అశోక్ కుమార్‌కి అప్పగిస్తుంది. తనలాంటి స్థితి తన కూతురికి రాకూడదన్నది ఆమె ఆలోచన. ఈ పాట ఈ సందర్భంలో వస్తుంది.

నాయికా నాయకులిద్దరికీ తెలుసు తాము ఎన్నటికీ కలవలేమని. కానీ తమ నడుమ ఉన్న ప్రేమ భావన ఎన్నటికీ తరగదనీ వారికి తెలుసు. ఒకరినొకరు చూడాలని తపన పడరు. ఆరాట పడరు. ఎవరి పనులు వారు మౌనంగా చేసుకుంటూ పోతారు. గుండెనిండుగా పట్టలేనంత ప్రేమను దాచుకుని. వారి ప్రేమ అతి పవిత్రమైంది. అలౌకికమైనది. వారి ప్రేమ ఎలాంటిదంటే భగవంతుడి మందిరంలో వెలిగించిన దీపపు జ్యోతిలాంటిది. భగవంతుడి చరణాలకు అర్పించిన కుసుమం లాంటిది. అంత మృదువైనది, మధురమైనది, పవిత్రమైనది, అనుభవాతీతమైనది, అలౌకికమైనది వారి ప్రేమ. ఆ ప్రేమను ప్రతీకలతో తప్ప పదాలతో వ్యక్తపరచటం కుదరదు. అదే చేశాడు మజ్రూహ్. మందిరలో వెలిగే దీపం కాదు, దీపపు జ్యోతితో పోల్చాడు వారి ప్రేమను. ఎందుకంటే, దీపం మీద దుమ్ము ధూళి పడవచ్చు. కానీ, దీపపు జ్యోతిని ఏ మలినాలూ తాకలేవు. తాకినా దీప శిఖలో కాలి శుద్ధమయిపోతాయి. వారి ప్రేమ కూడా ఇంత పరిశుద్ధమూ, పవిత్రమూ అన్నమాట.  ఇలాంటి పాటలకు వాయిద్యాల హోరు ఉండకూడదు. పాట ఎంత మృదువుగా ఉందో, నేపథ్య సంగీతం  కూడా అంత సుతిమెత్తగా ఉండాలి. రోషన్ అదే చేశాడు.

పాట పాడేందుకు హేమంత్ కుమార్, లతా మంగేష్కర్‌లను ఎంచుకోవటంతో పాటలో ప్రతి పదం అలవికాని పవిత్రతను అలుముకుంది. లతా స్వరంలో పవిత్రత గురించి ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. హేమంత్ కుమార్ పాట పాడుతూంటే ఒక భక్తుడు, భగవంతుడి ముంగిట కూర్చుని భక్తి భావనలో సర్వం మరచి తల్లీనుడై హృదయలోతుల్లోంచి గానం చేస్తూన్నట్టుంటుంది. అంత శుద్ధంగా, పవిత్రంగా ఉంటుంది హేమంత్ కుమార్ పాట పాడటం. వీరిద్దరూ కలసి యుగళగీతం పాడటం 'అద్భుతం'అయితే  ఇలాంటి పాట పాడటం పరమాద్భుతం. గుడిలో దీపం వెలిగించి, పుష్పార్చన చేసి, ధూపం వేసినట్టుంటుంది.

**ఛుపాలో యూ దిల్ మె ప్యార్ మేరా**

## కె జైసే మందిర్ మె లౌ దియే కీ..

తన ప్రేమను, గుడిలో జ్యోతిలా, హృదయంలో దాచుకోమంటున్నాడు నాయకుడు. ఈ భావనే గమ్మత్తయిన భావన.

దీపాన్ని కళ్లకద్దుకుంటాం. దీపానికి కళ్లు మూసుకుని దణ్ణం పెట్టుకుంటాం. కళ్లతో మనం ప్రపంచాన్ని చూస్తాం. దృశ్యాల సౌందర్యాన్ని అనుభవిస్తాం. కానీ భగవంతుడిని దీపం వెలుగులో చూస్తూ దండం పెట్టుకుని కళ్లు మూసుకుంటాం. ఆ జ్యోతిని హృదయంలో ప్రతిష్టించుకుంటాం. అందుకే తన ప్రేమ భగవంతుడి ముందరి జ్యోతి శిఖలాంటిదని, ఆ జ్యోతిని హృదయంలో ప్రతిష్టించుకోమని అంటున్నాడు. అంత పవిత్రం అన్నమాట అతని ప్రేమ.

ఇక్కడ అతడు తన ప్రేమ పవిత్రమైనది అని చెప్పటమే కాదు, తన ప్రేమను స్వీకరించమని అభ్యర్ధిస్తున్నాడు కూడా, ఇక్కడ అతడి ప్రేమకు ప్రతీకగా మందిరంలోని దీపపు జ్యోతిని వాడాదు మజ్రూహ్. ఇక్కడే మజ్రూహ్ గొప్పతనం తెలుస్తుంది.

సాధారణంగా సూఫీ కవులు 'దీపశిఖ'ను ప్రేమకు, స్త్రీకి ప్రతీకగా వాడతారు. పురుషుడు దీపం పురుగు. స్త్రీ దీపశిఖ. పురుషుడు స్త్రీ ప్రేమలో పడి సర్వం త్యాగం చేస్తాడు. దీనికి ఓ కథ కూడా ఉంది.

దీపం పురుగులు అసలు ప్రేమ ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుకుంటాయి. దీపాన్ని వెతుకుతూ వెళ్తాయి. దీపం కనిపిస్తుంది. ఒక పురుగు దీపం దగ్గరగా వెళ్లివస్తుంది. రెండోది ఇంకాస్త దగ్గరగా వెళ్లి వస్తుంది. దాని రెక్కలు మండుతాయి. మూడోది ఇంకాస్త దగ్గరగా వెళ్తుంది. రెక్కలు కాల్తాయి. నాలుగోది తిన్నగా వెళ్లి దీపం శిఖలోకి దూకుతుంది. అది నిప్పుతో వెలిగిపోతుంది. 'అదీ అసలైన ప్రేమ' అంటాడు సూఫీ కవి షమ్మ, పర్వానాలు సూఫీ కవులకు అత్యంత ఇష్టమైన ప్రతీకలు.

అయితే ఇక్కడ సాహిర్ 'దీపశిఖ'ను ఫార్సీ కవులు వాడినట్టు వాడలేదు. 'దీపశిఖ'ను ప్రేమకు ప్రతీకగా తీసుకున్నా, అది కాల్చి పడేసే జ్యోతికాదు, గుండెల్లో భద్ర పరచుకోవాల్సిన అత్యంత పవిత్రమైన ప్రేమ. మందిరంలో భగవంతుడిని అర్పించేందుకు వెలిగించిన దీపం అది. ధూపదీప నైవేద్యాలు పూజలో ప్రధానాంశాలు. అలా వెలిగించిన దీపం అది. అది భక్తి దీపం. ఆ జ్యోతిని, ఆ దీప శిఖను అతి భద్రంగా హృదయంలో దాచుకోవాలి.

భగవంతుడి ముందు దీపం వెలిగించటం భారతీయ ధర్మంలో అత్యద్భుతమైన ప్రతీక. దీపం వెలుతురునిస్తుంది. వెలుతురు విజ్ఞానం. సకల విజ్ఞానానికి, చైతన్యానికి మూలం దైవం. మందిరంలో దీపం వెలిగించటం అంటే హృదయంలో జ్ఞానదీపం వెలిగించినట్టే. దీపమే భగవంతుడు. దీపాన్ని హృదయంలో ప్రతిష్ఠించుకోవటమే. ప్రేమ భగవంతుడు. ప్రేమను హృదయంలో దాచుకోవటం అంటే భగవద్భావనను హృదయంలో ప్రతిష్ఠించుకోవటమే.

**దీపం జ్యోతి పరబ్రహ్మ దీపజ్యోతిర్జనార్ధనః**

**దీపజ్యోతి ప్రరబ్రహ్మ. దీప జ్యోతి జనార్ధనుడు.**

**దీప శ్లోకాలలో ఒక శ్లోకం మొదటి పాదం ఇది.**

ఇప్పుడు 'ఛుపాలో యా దిల్ మె ప్యార్ మేరా, కె జైసె మందిర్ మె లౌ దియే కీ' అన్న వాక్యం వింటే మామూలుగా అనిపించదు. పాట మామూలు సినిమా ప్రేమగీతంలా అనిపించింది. మధ్య యుగపు భక్తి కవులు, భగవంతుడి భక్తి పారవశ్యపు మాధుర్య భావన సముద్ర లోలోతుల్లో తన్మయులై విహరిస్తూ ఆలపిస్తున్న మధుర భక్తి గీతం అనిపిస్తుంది. ముఖ్యంగా హేమంత్ కుమార్ ప్రతి పదాన్ని ఎంత పవిత్ర భావన ధ్వనించే రీతిలో ఉచ్చరించాడో గమనిస్తే 'ఇది మామూలు సినిమా పాట ' అనిపించదు. ఆపై, ఎలాంటి దురూహలు కలగకుండా, అపోహలు లేకుండా సంగీత దర్శకుడు రోషన్, గుడిలో పాడే పాటలలో వినిపించే ధ్వనులను లయగా, శుద్ధ మురళీ స్వరాన్ని ఇంటర్లూడ్ కోసం వాడటంతో ఇది 'ప్రేమ భజన' భగవంతుడి భక్తి స్థాయికి ఎదిగిన 'పవిత్ర ప్రేమ భజన' అనిపిస్తుంది.

**తుం అప్‌ని చరణోంమె రఖ్‌లో ముఝ్కో**

**తుమ్హారి చరణోంకి ఫూల్ హూమై**

**మై సర్ ఝుకాయే ఖడీ హు ప్రీతం**

**కె జైసె మందిర్ మే లౌ దియే కీ.**

నాయకుడికి దీటైన జవాబిస్తుంది నాయిక. ఒకరు భక్తితో దీపం వెలిగిస్తే, మరొకరు భక్తితో శిరసు వంచి భగవంతుడి పాదాల వద్ద పుష్పాన్ని అర్పిస్తున్నారు.

మందిరంలో దీపాలు విడదీయరాని భాగాలు. దీపం వెలగని గర్భగుడి ఊహకు కూడా అందదు. అందుకే 'కె జైసె మందిర్ మె లౌ దియ్ ఏకీ ' అన్నాడు.

ఎలాగయితే, దీపంలేని మందిర అంతర్భాగాన్ని ఊహించలేమో, అలాగే పుష్పాలు లేని భగవంతుడి చరణాలను కూడా ఊహించలేము.

నన్ను నీ చరణాల వద్ద ఉండనివ్వు. నీ చరణాలకు అర్పితమైన పూవును నేను. నేను మందిరంలో ఒదిగి నిలచిన దీపశిఖలా శిరస్సు వంచి నిలిచాను అంటోంది నాయిక.

అతడి ప్రేమ భగవంతుడి ముందు ఉంచిన దీపం లాంటిది. హృదయంలో దాచుకో అని అతడంటే, నీ చరణాల వద్ద పుష్పంలాంటిదాన్ని, నన్ను స్వీకరించమని శిరస్సువంచి అభ్యర్థిస్తున్నాను, మందిరంలో దీపజ్యోతిలాగా అంటోంది నాయిక.

అత్యద్భుతమైన ప్రతీకలు. సినిమాలో సందర్భానికి తగ్గట్టున్న ప్రతీకలు. భక్తి కవిత్వం సరసన సగర్వంగా సినిమా పాటను నిలిపిపేంత అత్యద్భుతమైన ప్రతీకలివి. సినిమాలో నాయకుడు సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవాడు. ఆత్మ విశ్వాసం అధికంగా కలవాడు. అందుకని 'నా ప్రేమను హృదయంలో పవిత్రంగా దాచుకో ' అని అన్నాడు. నాయిక వేశ్యా మందిరాలలో నర్తకి. ఆమె కూతురిని అతడికి అప్పగించింది భద్రంగా చూడమని. ఆమె ఆజ్ఞాపించలేదు. కాబట్టి మందిరంలో దీప జ్యోతిలా తలవంచుకుని నిలచి, తనను అతని చరణాల వద్ద అర్పించిన పుష్పంలా భావించి అక్కడ ఉండనిమ్మని అభ్యర్థిస్తోంది. ఇద్దరి ప్రేమ స్వరూపం ఒకటే. అతి పవిత్రమే. దైవ స్వరూపమే. కానీ స్వభావం వేరు.

ఇద్దరూ కలవటం అసంభవం. కానీ ప్రేమలో తేడాలేదు. అతడి ప్రేమ పవిత్రం. కలవాలని ఆమెకూ లేదు. కానీ అతడి ప్రేమను వదలలేదు. మరవలేదు. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాల్సింది ఉంది.

భారతీయ ధర్మంలో ప్రేయసి, ప్రియుడి పాదాల చెంత ఉండాలన్న భావనలేదు. లక్ష్మీదేవి విష్ణువు హృదయంలో ప్రతిష్టితం. శివుడి శరీరంలో పార్వతి సగం భాగం. 'కాళ్ల దగ్గర స్థలం' అనే భావన సూఫీ భక్తి కవితల ప్రభావం.

**బదర్ అలీ సాహిబ్ అన్సారీ సూఫీ కవిత పల్లవి ఇది**

**నిత్ ఖైర్ మాంగా సోహ్నేయా మై తెరీ, దువా న కోయీ హోర్ మాంగ్దీ**

**తేరె పైరాంచ్ ఆఖీర్ హోతీ మేరీ, దువా నా కోయీ హోర్ మాంగ్గీ.**

ప్రతిరోజూ నీ క్షేమ సమాచారాలను వాంఛిస్తాను. భగవంతుడిని ఇది తప్ప మరొకటి అభ్యర్థించను. నా జీవితం చివరి ఘడియ నీ పాదాల చెంత గడపాలని వేడుకుంటాను. భగవంతుడిని ఇది తప్ప మరొకటి కోరుకోను.

ఇలా పాదాల చెంత జీవితం గడపాలని, పాదాలవద్ద పూవులా నిలవాలన్న భావన మధ్య యుగంలో భారతీయ సమాజంలో వచ్చి చేరింది.

అంతకుముందు యుద్ధానికి వెళ్లారు భార్యలు. కోపం వస్తే భర్త తలని కాలితో తన్నారు. కాళ్లు పట్టించుకున్నారు. కానీ కాళ్ల మీద పడి వేడుకున్న మహిళలు లేరు. భర్త ఒక్కమాట అంటే చితి పేర్పించుకుని అగ్నిపరీక్ష స్వచ్ఛందంగా ఇచ్చిన మహిళలు ఉన్నారు. అవసరమైతే అవమానించిన వాడిని  శూలంతో పొడిచి చంపి రక్తంతాగిన మహిళాశక్తి ప్రదర్శించిన వారున్నారు. కానీ నీ పాదాల చెంత ఉండనిమ్మన్న మహిళ లేదు.

కానీ ఇక్కడ నాయిక 'తుమ్హారి చరణోంకి పూల్ హూ మై' అంటోంది. ఇంతగా సంపూర్ణమైన ప్రేమ భక్తి భావనకు కారణం ఈ మహిళ సామాజికంగా ఉచ్చ స్థాయిలో లేకపోవటమే. ఈ ఔచిత్యాన్ని దృష్టిలో ఉంచుకుని సందర్భానికి తగ్గట్టు సూఫీ భక్తి భావాన్ని ప్రదర్శించాడు మజ్రూహ్.

**యె సచ్ హై జీనా థ పాప్ తుం బిన్**

**యె పాప్ మైనే కియా హై అబ్ తక్**

**మగర్ హై మ న్మే ఛబీ తుమ్హారీ**

**కె జైసే మందిర్ మె లౌ దియే కీ.**

ఆమెకు దూరమై జీవించటం పాపం. కానీ ఆ పాపం అతను అంతవరకూ చేశాడు. కానీ అతని హృదయంలో ఆమె మూర్తి స్థిరంగా ప్రతిష్ఠితమై ఉంది, మందిరంలో దీపజ్యోతిలాగా.

ఆమెకు దూరమై బ్రతకటం పాపం. కానీ అతను జీవిస్తున్నాడు. ఎలాగంటే ఆమెను స్మరిస్తూనే.  నాయకుడు అవివాహితుడిలానే మిగిలిపోతాడు. కాబట్టి సందర్భంలో ఒదుగుతూ నాయకుడి పాత్ర వ్యక్తిత్వాన్ని నిజాయితీని

తెలుపుతోంది ఈ చరణం. మందిరంలోని దీపజ్యోతిలా ఆమె మూర్తి అతని హృదయంలో ప్రతిష్టితమై ఉండటం, అతని ప్రేమ పవిత్ర భావనను నొక్కి చెప్తుంది.

**ఫిర్ ఆగ్ బిర్హా కి మత్ లగానా**

**కె జల్కె మై  రాఖ్‌హో చుకీ హూ...**

ఇది నాయిక అంటుంది. ఈ పదాలు లత పాడిన తీరు ఆమెను సంగీత సరస్వతిగా  ఎందుకు భావిస్తారో తెలుపుతుంది.

సినిమాలో నాయిక బలహీన కాదు. బేల కాదు. సమాజాన్ని ఎదిరించింది. తన కూతురి కోసం పోరాడి నిలుస్తోంది. అతని మీద ప్రేమ ఉన్నా పరిస్థితులకు తల వంచి మరొకడిని వివాహమాడి నిజాయితీగా అతడిని ప్రేమించాలని ప్రయత్నించింది. అందుకు అతడు అర్హుడు కాదు. దాంతో సమాజాన్ని ఎదిరించి కూతురి కోసం వేశ్యా వాటికను ఆశ్రయించింది. తాను సమిధలా కాలిపోతూ కూడా కూతురిని అన్నిటికీ దూరంగా ఉంచి చక్కటి జీవితాన్ని ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. అయినా, ఇప్పటికీ అతని మీద ప్రేమ ఉంది. కానీ, దాని స్వరూపం ఇప్పుడు వేరు.

ఆమెకు దూరంగా ఉండి జీవించటం 'పాపం'అని అతడు అన్నాడు. అతనికి దూరమై తాను కాలి బూడిదనైపోయాను అంటోందామె. అది నిజమే. ఇప్పుడామెకు ఎలాంటి ఆశలు, కోరికలు లేవు.  ఆమెకు ఉన్న ఏకైక కోరిక కూతురు సుఖంగా ఉండటం.  అందుకే ఇప్పుడీ విరహాగ్ని ప్రజ్వలింప చేయకు. నేను కాలి బూడిద అయిపోయాను అంటోంది. అంటే, ఆమె సంపూర్ణంగా రూపాంతరం చెందిందన్నమాట. అప్పటి ఆమెకాదీమె. ఆమె ప్రాణంతో ఉండేది. ఈమె బూడిద.

దానికి ప్రతిగా అతడు

**యె రాఖ్ మాథే పె  మైనె రఖ్ లీ**

**కె జైసె మందిర్ మె లౌ దియే కీ ...**

అంటున్నాడు.

ఆ బూడిదను అతను నుదుటిపై పూసుకున్నాడు, మందిరంలో దీపజ్యోతిలాగా.

'బూడిదను నుదుటిపై పూసుకోవటం' భారతీయ ధార్మిక ప్రతీక. అందరం ఏదో ఒకరోజు బూడిద అవ్వాల్సిన వాళ్లమే. మానవ జీవితంలోని క్షణ భంగురత్వానికి ప్రతీక బూడిద శరీరానికి పూసుకోవటం.కానీ, ఇతర సందర్భాలలో అది బూడిద. కానీ, దైవం దగ్గర అది విభూతి.

, ఆమెలోని ప్రేమ, కాలి బూడిదయిపోయింది. ఆ బూడిదను అతను పాలభాగాన ధరించాడు, మందిరంలో దివ్వె అంత పవిత్రంగా!

పాట వింటూంటే ఏవేవో లోకాలలో విహరించి, అపరిమితానందాన్ని, ఉజ్వలమైన భక్తి భావనను అనుభవిస్తాం.

ముఖ్యంగా లతా మంగేష్కర్ కొన్ని పదాలను ఒత్తి పలుకుతూ, రెండోసారి అదే పదాన్ని పలికినప్పుడు కణ స్వరం వేసి పలుకుతూ అదే పదం నూతనార్థం ఇచ్చేలా పలుకుతూ, స్వరంలోని పవిత్రతను పదంలోని కణకణానికి ఆపాదిస్తూ పాడిన విధానం పాట స్థాయిని పెంచుతుంది. ఆమెకు తగ్గట్టుగా హేమంత కుమార్ స్వరం ఎలాంటి అలంకారాలు, లేకుండా అతి స్పష్టంగా, సాఫీగా ధ్వనిస్తూ పాటలో పవిత్ర భావనను మరింత పెంచుతుంది.

పాటలో సంపూర్ణ భారతీయ ప్రతీకలతో ప్రేమ భావనలోని దైవత్వాన్ని, దైవ భావంలోని ప్రేమ తత్వాన్ని స్ఫురింపచేస్తూ, హృదయానికి హత్తుకునేలా పాటను సృజించాడు మజ్రూహ్.

పాట చిత్రీకరణ కూడా ప్రతీకాత్మకంగా ఉంటుంది. నాయకుడు నల్ల కళద్దాలు ధరించి కారులో ప్రయాణిస్తూంటాడు. ముఖంలో భావాలు కనిపించకుండా. నాయిక పరదా మాటున కనిపించీ కనిపించనట్టుంటుంది. ఇద్దరూ వేర్వేరు స్థలాల్లో ఉంటారు, వారిద్దరి నడుమ ఎడమను సూచిస్తూ. అతడు ఠీవిగా ఉంటాడు. ఆమె దైన్యం ప్రదర్శిస్తుంది. చిత్రీకరణలో ఎంత జాగ్రత్త ప్రదర్శించారంటే, ఒక్క 'షాట్'లో కూడా ఇద్దరి కంటి స్థాయి ఒక్కటిగా ఉండవు. Eye level కూడా కలవదు. ఆమె కాలి బూడిదయింది. అతడు ఆ బూడిదను నుదటిన అద్దుకున్నాడు. ఆమె అతడి పాదాల వద్ద పుష్పం. అతడి హృదయంలో ఉన్నది ఆమె రూపం. ఇద్దరి ప్రేమ, మందిరంలో వెలిగే దీపజ్యోతిలాంటిది.

ఇది 'మమత' సినిమాలోని అత్యద్భుతమైన ప్రేమ భక్తి గీతం. ఇలాంటి సంస్కారవంతమయిన గీతాలు ప్రజల హృదయాలలో ఉత్తమ సంస్కార బీజాలు నాటుతాయి. నిద్రాణ స్థితిలో ఉన్న ఉన్నతమైన భావాలకు ఊపిరి పోస్తాయి.

సున్నితత్వాన్ని నేర్పుతాయి. ప్రేమ భావనలోని ఔన్నత్యాన్ని ప్రకటిస్తాయి. ప్రేమంటే లైంగిక చర్య మాత్రమే కాదు. ప్రేమ అంటే పిచ్చిగెంతులు, వెర్రిమొర్రి నృత్యాలు కాదు, ప్రేమ అంటే మందిరంలో వెలిగే దీపజ్యోతి, హృదయంలో పవిత్రంగా నిలుపుకోవాలి, ప్రేమ ధర్మం, ప్రేమ బాధ్యత  అన్న సత్యాన్ని ప్రస్ఫుటం చేస్తాయి ఇలాంటి పాటలు. ఇది కళాకారుల కళాసృజన లక్ష్యం, మనిషిని ఉన్నతుడిని చేయటం.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

Click here to share your comments